సాక్షి
అనకాపల్లి
సోమవారం । 18 । ఆగస్టు । 2025



### ఇస్కాన్‌లో ముగిసిన వేడుకలు

కొమ్మాది: విశాఖ సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న శ్రీకృష్ణాష్టమి వేడుకలు వైభవంగా ముగిశాయి.



### తెరచుకున్న చాపరాయి

డుంబ్రిగుడ: వర్షాల కారణంగా రెండు రోజులుగా మూడపడిన చాపరాయి జలవిహారి ఆదివారం తెరచుకుంది.



### కనకమ్మకు విశేష పూజలు

డాబాగార్డెన్స్: విశాఖలోని కనకమహాలక్ష్మి ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీలక్ష్మి పూజలు ఆదివారంతో 24వ రోజుకు చేరాయి.

## న్యూస్‌రీల్

### విజయవాడ కనకదుర్గమ్మకు పసుపు, కుంకుమ



పసుపు, కుంకుమ అందజేస్తున్న శతకంపట్టు కనకదుర్గమ్మవారి దేవస్థానం ప్రతినిధులు

అనకాపల్లి టౌన్: విజయవాడ కనకదుర్గ అమ్మవారి దేవస్థానం ప్రతినిధులకు గవరపాలెం శతకంపట్టు కనకదుర్గ అమ్మవారి దేవస్థానం నుంచి పసుపు, కుంకుమ అందజేశారు. విజయవాడలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో శతకంపట్టు కనకదుర్గ అమ్మవారి దేవస్థానం ప్రతినిధులు మాట్లాడుతూ శరన్నవరాత్రుల మహోత్సవం కోసం బెజవాడ కనకదుర్గమ్మకు ప్రతీ ఏడాది పసుపు, కుంకుమ అందజేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు కాండ్రేగుల నాయుడు, పి.వి.రమణ, భీమరశెట్టి వర, గవరపాలెం గౌరీ పరమేశ్వరి, మరిడిమాంబ అమ్మవారి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### జాతీయ చెస్ పోటీలకు శ్రావ్యశ్రీ



గెలుచుకున్న కప్‌తో శ్రావ్యశ్రీ

ఎస్.రాయవరం: జాతీయ స్థాయి చెస్ పోటీలకు ఎస్.రాయవరానికి చెందిన భీమరశెట్టి శ్రావ్యశ్రీ ఎంపికైంది. కాకినాడలో శనివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్ 17 బాలికల చెస్ చాంపియన్‌షిప్‌లో 7 రౌండ్లలో 6 పాయింట్స్ సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటిన శ్రావ్యశ్రీని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు.

### నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

తుమ్మపాల: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని సోమవారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌తో పాటు అన్ని మండల, మున్సిపల్, డివిజనల్ కార్యాలయాల్లోనూ పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. అర్జీలు, ఫిర్యాదుల నమోదుకు అనివార్య కారణాల వలన ప్రభుత్వ కార్యాలయాలకు రాలేనివారు తమ వినతులను ఆన్‌లైన్ ద్వారా meekoram.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవడానికి అవకాశం కల్పించామన్నారు. అర్జీదారులు టోల్ ఫ్రీ నెం.1100కు కాల్ చేసి అర్జీల స్థితిని తెలుసుకోవచ్చన్నారు.

### ఐవీఎఫ్ కేంద్రాలపై వైద్య ఆరోగ్యశాఖ తనిఖీలు

మహారాణిపేట (విశాఖ): నగరంలోని 'సృష్టి' ఐవీఎఫ్ సెంటర్‌లో అక్రమాలు బయటపడిన నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. జిల్లాలో ఉన్న ఐవీఎఫ్, సరోగసీ సెంటర్లపై తనిఖీలు ముమ్మరం చేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి. జగదీశ్వరరావు ఆధ్వర్యంలో నాలుగు బృందాలు ఈ తనిఖీలు నిర్వహిస్తున్నాయి. ఇప్పటివరకు 53 సెంటర్లలో 32 కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో పలు అక్రమాలు వెలుగుచూశాయి. డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు, వైద్య ఆరోగ్యశాఖకు చెందిన డాక్టర్ ఉమావతి, డాక్టర్ నమత, డాక్టర్ లూసీ తదితరులు వేర్వేరు బృందాలుగా ఏర్పాటు ఈ సెంటర్లు తనిఖీలను ముమ్మరం చేశారు. చాలా కేంద్రాలు సేవలకు సంబంధించి సరైన రసీదులు ఇవ్వడం లేదని, నగదు లావాదేవీలను పుస్తకాల్లో నమోదు చేయడం లేదని అధికారులు గుర్తించారు. కొన్ని సెంటర్లు 100శాతం గ్యారెంటీ, 'పిల్లలు పుట్టకపోతే డబ్బులు తిరిగి ఇస్తాం' వంటి ప్రకటనలతో నిస్సహాయ మహిళలను ఆకర్షించి, వారి నుంచి రూ. 20 లక్షల నుంచి రూ. 40 లక్షల వరకు వసూలు చేస్తున్నారని తనిఖీల్లో తేలింది. ఈ దారుణమైన దోపిడీని అరికట్టేందుకు, ప్రతి సెంటర్‌లో చార్జీల వివరాలను తప్పనిసరిగా బోర్డుపై ప్రదర్శించాలని డాక్టర్ జగదీశ్వరరావు ఆదేశించారు. మిగిలిన కేంద్రాలను కూడా త్వరలో తనిఖీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

### 'సృష్టి గర్భ' పుస్తకావిష్కరణ

సీతంపేట (విశాఖ): నాటక రచయిత, కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ దీర్ఘాసి విజయభాస్కర్ రచించిన 'సృష్టి గర్భ' (ఉపనిషత్ కాంతి) పుస్తకావిష్కరణ సభ ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. శ్రీమాతా కళాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్ పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఉపనిషత్తులలోని లోతైన భావాలను హృదయానికి హత్తుకునేలా రచయిత పుస్తకంలో పొందుపర్చారన్నారు.



బుచ్చెయ్యపేట: తాచేరు డైవర్షన్ రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న వరదనీరు



చోడవరం: మండలంలో నీట మునిగిన వరి పొలం

# జల జీవనం

- జిల్లా అంతటా భారీ వర్షాలు
- నీట మునిగి దెబ్బతిన్న పంటలు
- అప్రమత్తమైన అధికార యంత్రాంగం
- కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు
- నేడు పాఠశాలలకు సెలవు



చోడవరం: స్వయంభూ విఘ్నేశ్వరాలయం గర్భగుడిలో చేరిన వరద నీరు

**కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్లు**

08924 222888
08924 225999
08924 226599



గొలుగొండ: జోగుంపేట నుంచి జమ్మాదేవిపేట వెళ్లే మార్గంలో నేలకూలిన చింత చెట్టు

తుమ్మపాల/అనకాపల్లి టౌన్: భారీ వర్షాలతో జిల్లాలోని అన్ని ప్రాంతాలు జలమయమయ్యాయి. ఆదివారం తెల్లవారు నుంచి తెరపివ్వకుండా వాన కురిసింది. వాగులు, వంకలు, పలు చోట్ల రోడ్ల మీదుగా వర్షపునీరు ఏరులై పారుతోంది. లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరి పంటలు నీట మునుగుతున్నాయి. రానున్న రెండు రోజులు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. కలెక్టర్ కార్యాలయం, రెవెన్యూ డివిజనల్, మండల కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. వర్ష ప్రభావంతో గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉత్పన్నమయినా అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని జిల్లా యంత్రాంగం ఆదేశించడంతో సచివాలయ, రెవెన్యూ సిబ్బంది గ్రామాల్లో స్థితిగతులపై దృష్టి సారించారు. అల్పపీడనం ప్రభావంతో ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సోమవారం సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. విద్యార్థుల రక్షణ, భద్రత దృష్ట్యా ముందస్తుగా జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్య పాఠశాలలకు సెలవు ప్రకటించినట్టు పేర్కొన్నారు.



రోలుగుంట: ఇంట్లోకి చేరిన వర్షం నీటిని బయటికి తోడుకుంటున్న ఇంటి యజమాని

**నీట మునిగిన చోడవరం శ్రీ స్వయంభూ విఘ్నేశ్వరస్వామి**

చోడవరం: వరద ముంపు ఆదిదేవుడైన వినాయకుడికి కూడా తప్పలేదు. ప్రముఖ పుణ్యక్షేత్రంగా భాసిల్లుతున్న చోడవరం శ్రీ స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయం వరద ముంపులో ఆదివారం చిక్కుకుంది. స్వామివారి ప్రధానాలయం ఏనుగుబోదు చెరువు గర్భంలో ఉండటంతో తుఫాను కారణంగా కురుస్తున్న భారీ వర్షాలకు చెరువు నిండిపోయింది. దీంతో స్వామివారి గర్భాలయంలో చెరువు ఊటనీరు బయటకు రావడంతో ఆలయంలో స్వామివారి మూలవిరాట్ విగ్రహం మునిగిపోయింది. గర్భాలయంలోకి ఊరుతున్న నీటిని బయటకు పంపించేందుకు మోటార్ల సాయంతో చర్యలు చేపట్టారు. తుపాను వర్షాలకు చోడవరం పరిసర ప్రాంతాల్లో పొలాలన్నీ నీట మునిగాయి. రోడ్లపై ఎక్కడిక్కడ నీరు నిలిచిపోవడంతో చోడవరం- అనకాపల్లి ,చోడవరం-నర్సీపట్నం ప్రధాన రహదారిపై పెద్దపెద్ద గోతులు పడి వాహనచోదకులకు ప్రాణాంతకంగా మారాయి. పట్టణంలో బాలాజీనగర్, న్యూశాంతినగర్, చీడికాడ రోడ్డు ప్రాంతాల్లో వర్షపునీరు రోడ్లపై ప్రవహించింది.

**పిడుగుపడి 28 గొర్రెలు మృతి**

ఉరుములు, మెరుపులతో ఆదివారం పిడుగు పడి దుడ్డుపాలెం గ్రామంలో 28 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. కూర్మదాసు తాతారావుకు చెందిన 18 గొర్రెలు, కూర్మదాసు రమణకు చెందిన 5 గొర్రెలు, మొల్లి గోవిందకు చెందిన 5 గొర్రెలను గ్రామ సమీపంలో ఉన్న కొండపైకి శనివారం రాత్రి తీసుకెళ్లి ఉంచారు. ఆదివారం ఉదయం వెళ్లి చూడగా మొత్తం గొర్రెలన్నీ పిడుగుపాటుకు మృతి చెంది ఉన్నాయి. వీటి సుమారు రూ. 3 లక్షలు విలువ ఉంటుందని బాధిత పెంపకందారులు చెప్పారు.

### రైవాడ జలాశయంలోకి పోటెత్తిన వరదనీరు



నిండుకుండలా రైవాడ రిజర్వాయర్

దేవరాపల్లి: గత రెండు రోజులుగా ఏకధాటిగా కురుస్తున్న భారీ వర్షాల ధాటికి రైవాడ జలాశయంలోకి భారీగా వరదనీరు పోటెత్తుతోంది. ప్రస్తుతం జలాశయంలోకి 800 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. రైవాడ జలాశయం గరిష్ట నీటిమట్టం 114 మీటర్లు కాగా ప్రస్తుతం 111.80 మీటర్లకు చేరుకుంది. 113.50 మీటర్లకు చేరుకుంటే గేట్ల ద్వారా శారదానదిలోకి నీటి విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఇరిగేషన్ డీఈఈ జి. సత్యంనాయుడు తెలిపారు. ఏ సమయంలోనైనా నీరు విడుదల చేసే అవకాశం ఉన్నందున శారదానది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇరిగేషన్ అధికార్లు తెలిపారు.

**ప్రమాద స్థాయిలో పెద్దేరు**

మాడుగుల: పెద్దేరు జలాశయంలో ఆదివారం సాయంకాలానికి వరద పోటు పెరిగింది. జలాశయంలోకి 900 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరడంతో అంతే వరద నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. జలాశయం గరిష్ట నీటిమట్టం 137 మీటర్లు కాగా ప్రస్తుతం 136.80 మీటర్ల ప్రమాద స్థాయికి చేరడంతో జలాశయం అధికారులు అప్రమత్తమయ్యారు.



దుడ్డుపాలెంలో మృతి చెందిన గొర్రెలు

### రోడ్లను ముంచెత్తిన వరద నీరు

బుచ్చెయ్యపేట: మండలంలో ఆదివారం ఒక్క రోజులోనే 60 మిల్లీమీటర్ల వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపై నుంచి వరద నీరు ప్రవహించగా పలు గ్రామాల్లో పంటలు నీట మునిగి దెబ్బతిన్నాయి. వరి, మినుము, పెసర, నువ్వులు, కూరగాయ పంటలు నీట మునిగాయి. వడ్డాది పెద్దేరు నది, విజయరామరాజుపేట తాచేరు నదిపైన ఉన్న డైవర్షన్ రోడ్లపై నుంచి వరద నీరు ప్రవహించడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. వడ్డాది, పేట డైవర్షన్ రోడ్ల వద్ద పోలీసులు ప్రమాదాలు జరగకుండా ఎస్ఐ శ్రీనివాసరావు బారికేడ్లు ఏర్పాటు చేశారు. ప్రధాన రహదారులను పోలీసులు మూసి వేయడంతో వాహనదారులు గౌరీపట్నం, బుచ్చెయ్యపేట, మంగళాపురం మీదుగా చోడవరం, అనకాపల్లి, విశాఖ, నర్సీపట్నం ప్రాంతాలకు ఇరుకు రోడ్లపై రాకపోకలు సాగిస్తున్నారు. బుచ్చెయ్యపేట తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ (నంబర్: 08943 294391) ఏర్పాటు చేసినట్టు తహసీల్దార్ లక్ష్మి తెలిపారు.



బుచ్చెయ్యపేట : వడ్డాది తాచేరు నదిపై నుంచి ప్రవహిస్తున్న వరద నీరు

### జిల్లాలో వర్షపాతం
(రాత్రి 10 గంటల వరకు)

సాక్షి, అనకాపల్లి: గడిచిన 24 గంటల్లో జిల్లాలో కురిసిన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.

| మండలం | మి.మీ. |
|---|---|
| చీడికాడ | 150.6 |
| కె.కోటపాడు | 146.8 |
| దేవరాపల్లి | 144.2 |
| మాడుగుల | 141.6 |
| చోడవరం | 131.8 |
| రోలుగుంట | 125.0 |
| రావికమతం | 122.6 |
| బుచ్చెయ్యపేట | 114.8 |
| అచ్యుతాపురం | 100.8 |
| యలమంచిలి | 96.8 |
| నర్సీపట్నం | 92.4 |
| మాకవరపాలెం | 86.4 |
| మునగపాక | 77.8 |
| పాయకరావుపేట | 76.8 |
| కశింకోట | 75.6 |
| అనకాపల్లి | 73.2 |
| గొలుగొండ | 71.2 |
| కోటవురట్ల | 59.4 |
| నాతవరం | 56.8 |
| రాంబిల్లి | 55.4 |
| నక్కపల్లి | 53.8 |
| ఎస్.రాయవరం | 46 |

# రెచ్చిపోతున్న రేషన్ మాఫియా



ఇటీవల యలమంచిలి మండలం ఏటికొప్పాక రైల్వేగేటు వద్ద పట్టుబడిన రేషన్ బియ్యం లారీ

- 80 శాతం చౌక బియ్యం పక్కదారి
- భారీ ఎత్తున రవాణా చేస్తున్న దళారులు
- కార్డుదారుల నుంచి కొన్న బియ్యం మిల్లుల్లో దాచి.. దర్జాగా తరలింపు
- తూతూ మంత్రంగా కేసులు
- కఠిన చర్యలు లేకపోవడమే కారణం

- ఈ నెల 8వ తేదీ రాత్రి యలమంచిలి మండలం ఏటికొప్పాక రైల్వేగేటు వద్ద 130 బస్తాల్లో 6.5 టన్నుల రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న లారీని యలమంచిలి డీటీ వినయ్‌కుమార్, వీఆర్వోలు పట్టుకున్నారు.
- గత నెల 10వ తేదీన యలమంచిలి మున్సిపాలిటీ తెరువుపల్లి న్యూ వెంకటేశ్వర రైసు మిల్లు నుంచి కాకినాడ పోర్టుకు తరలిస్తున్న 15 టన్నుల రేషన్ బియ్యంతో పాటు వాహనాన్ని యలమంచిలి రూరల్ పోలీసులు స్వాధీనపరుచుకున్నారు.

**చౌక దుకాణాల ద్వారా పేద ప్రజలకు పంపిణీ అవుతున్న బియ్యం ఇలా నిత్యం వాహనాల్లో అక్రమ రవాణా జరుగుతోంది. ప్రతి నెలా రేషన్ పంపిణీ చేసే మొదటి రెండు వారాల్లో చౌక బియ్యం రవాణా యథేచ్ఛగా కొనసాగుతోంది.**

యలమంచిలి రూరల్: జిల్లాలో రేషన్ మాఫియా రెచ్చిపోతోంది. కార్డుదారుల వద్ద వేలిముద్ర తీసుకోకముందే బియ్యాన్ని వాహనాల్లో తరలిస్తున్నారు. అక్రమ వ్యాపారులపై ఉక్కుపాదం మోపుతామంటూ కూటమి ప్రభుత్వ పెద్దలు చెబుతున్న మాటలు కేవలం ప్రకటనలకే పరిమితమయ్యాయి. కూటమి పార్టీల నాయకుల అండదండలతోనే ఈ దందా యథేచ్ఛగా సాగుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రేషన్ షాపులు, లబ్ధిదారుల వద్ద బియ్యం కొనుగోలు చేసి కాకినాడ పోర్టుకు, ఇతర జిల్లాలకు తరలిస్తున్నారు. పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం పెద్ద ఎత్తున నల్లబజారుకు తరలిపోతున్నా దీనిని అరికట్టడంలో పౌరసరఫరాల శాఖ అధికారులు విఫలమవుతున్నారు. ఎక్కడైనా రేషన్ బియ్యం పట్టుబడినా కేసులు పెట్టి మమ అనిపిస్తున్నారన్న విమర్శలున్నాయి.

**80 శాతం నల్లబజారుకే..**

ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసే రేషన్ బియ్యాన్ని పలువురు అక్రమార్కులు ఆదాయ వనరుగా మార్చేసుకున్నారు. జిల్లావ్యాప్తంగా 5,09,688 తెల్ల కార్డులు, 25,804 అంత్యోదయ కార్డులు ఉండగా 15,15,602 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 5 కేజీల చొప్పున నెలకు సుమారు 7,578 మెట్రిక్ టన్నుల బియ్యం ఉచితంగా పంపిణీ అవుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కిలో రేషన్ బియ్యానికి రూ.43 చొప్పున ఖర్చు చేస్తున్నాయి. జిల్లాలో కార్డుదారులందరికీ ప్రతి నెలా బియ్యం సరఫరా చేయడానికి దాదాపు రూ.32.59 కోట్లకు పైగా వెచ్చిస్తున్నాయి. అందులో 20 శాతం మాత్రమే సక్రమంగా వినియోగం అవుతోంది. సుమారు రూ.26 కోట్ల విలువైన బియ్యం పక్కదారి పడుతోంది. ఏడాదికి ప్రభుత్వాలు ఖర్చు పెట్టే 391 కోట్లలో 312 కోట్ల విలువైన బియ్యం నల్లబజారుకే తరలిపోతోంది. రేషన్ బియ్యం ఎక్కువగా రైస్ మిల్లులకు చేరుతోంది. రైస్ మిల్లుల్లో పెద్ద ఎత్తున చౌక బియ్యం నిల్వలు ఉంటున్నా మిల్లుల నిర్వాహకులు ఇచ్చే మామూళ్లకు ఆశపడి అధికారులు తనిఖీలు చేయడంలేదన్న ఆరోపణలున్నాయి.

### కొనేది రూ.18... ఎగుమతి చేసేది రూ.40


జిల్లాలో యలమంచిలి, చోడవరం, నర్సీపట్నం, అనకాపల్లి, పాయకరావుపేట, కె.కోటపాడు ఏరియాల్లో భారీగా చౌక బియ్యం కొనుగోలు చేసే రైసుమిల్లుల యజమానులు ఉన్నారు. దళారులు, డీలర్ల నుంచి కేజీ బియ్యం రూ. 16 నుంచి రూ.18లకు కొని కొనుగోలు చేసి తమ రైసు మిల్లుల్లో నిల్వ చేస్తున్నారు. ఆపై రైసు మిల్లుల యజమానులు, కొంతమంది ఎగుమతిదారులు కిలోకు రూ.30 వరకు సంపాదిస్తున్నారు. విదేశాలకు ఎగుమతి చేసే బియ్యం కిలో రూ.40 వరకు ఉంటోంది. డీలర్లు, రైసు మిల్లుల యజమానులు, ఇతర అక్రమార్కులపై 6 ఏ కేసులు నమోదైనా కఠిన చర్యలు తీసుకోవట్లేదు. పౌరసరఫరాల శాఖ అధికారుల డొల్లతనంతో టన్నుల్లో రేషన్ బియ్యం రీసైక్లింగ్ చేసి, కాకినాడ పోర్టు, చేపల చెరువులు, కోళ్ల ఫారాలకు తరలించి జేబులు నింపుకొంటున్నారు. రేషన్ బియ్యాన్ని నిల్వ చేసే రైసు మిల్లుల్లో బియ్యం నిల్వల తనిఖీలు, రికార్డులను తరచుగా తనిఖీ చేస్తే రేషన్ బియ్యం మాఫియా ఆగడాలకు అడ్డుకట్ట వేయవచ్చు.

**రేషన్ షాపుల ద్వారా నెలకు పంపిణీ చేస్తున్న బియ్యం 7,578 మెట్రిక్ టన్నులు**

**ఉచిత బియ్యానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెచ్చిస్తున్న మొత్తం నెలకు రూ.32.59 కోట్లు**

**నల్లబజారుకు తరలిపోతున్న రేషన్ బియ్యం విలువ సుమారు రూ.26 కోట్లు**

**ఇప్పటివరకు నమోదైన 6 ఏ కేసులు: 87**



గత నెల 10వ తేదీ తెరువుపల్లిలో యలమంచిలి పోలీసులు స్వాధీనపరుచుకున్న బియ్యం వ్యాన్

### అధికారులు ఏం చేస్తున్నట్టు?



నిత్యం రేషన్ బియ్యం అక్రమ కొనుగోళ్లు, రవాణా, రీసైక్లింగ్ జరుగుతున్నా పౌరసరఫరాల శాఖ అధికారులు ఏం చేస్తున్నారో అర్థం కావడం లేదు. తమ కళ్ల ముందే అంతా జరుగుతున్నా వారికేమీ పట్టడం లేదు. రేషన్ బియ్యం అక్రమ రవాణా సమాచారం తెలిసినపుడు ఆ శాఖ అధికారులకు ఫోన్ చేసినా స్పందించడం లేదు. సెలవు రోజుల్లో అయితే పౌరసరఫరాల శాఖ అధికారుల తీరు మరీ దారుణం.

–చాకలి నూకరాజు, ఆర్టీఐ యాక్టివిస్టు, యలమంచిలి

### ఎఫ్‌డీపీ నిర్వహణకు ఏర్పాట్లు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సాంకేతిక విద్యా శాఖ జాయింట్ డైరెక్టర్ కె. పద్మారావు

మురళీనగర్ (విశాఖ): జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకమైన అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎఫ్.డి.పి) ను విశాఖ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో సోమవారం నుంచి నిర్వహించనున్నారు. దేశవ్యాప్తంగా ఎంపికైన 300 కళాశాలల్లో విశాఖపట్నం పాలిటెక్నిక్ కాలేజీ కూడా ఉందని కాలేజీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రత్నకుమార్ తెలిపారు. 'న్యూమరికల్ అప్రోచ్ ఇన్ డిజైన్ థింకింగ్' అనే అంశంపై ఈ కార్యక్రమం ఈనెల 18 నుంచి 23 వరకు జరుగుతుంది. ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ కళాశాలల నుంచి దాదాపు 50 మంది అధ్యాపకులు, పరిశోధకులు ఈ ఆఫ్‌లైన్ శిక్షణలో పాల్గొంటారు. కార్యక్రమంలో డిజైన్ థింకింగ్‌లో సంఖ్యా విధానాలు, అడ్వాన్స్‌డ్ పద్ధతులు, ఫైనైట్ ఎలిమెంట్స్ వంటి అంశాలపై నిపుణులు శిక్షణ ఇస్తారు.

### ఏపీఎల్ మ్యాచ్‌లకు వర్షం అడ్డంకి

విశాఖ స్పోర్ట్స్ : ఆంధ్ర ప్రీమియర్ లీగ్ లో భాగంగా వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో ఆదివారం జరగాల్సిన రెండు మ్యాచ్‌లు వర్షం ఆటంకం ఏర్పడింది. రాయలసీమ రాయల్స్, కాకినాడ కింగ్స్ మధ్య జరిగిన మ్యాచ్‌ను ఐదు ఓవర్లకు కుదించారు. తొలుత బ్యాటింగ్ చేసిన కాకినాడ కింగ్స్ నాలుగు వికెట్ల నష్టానికి 69 పరుగులు చేసింది. ఓపెనర్ భరత్ డకౌట్‌గా వెనుదిరిగినా, లేఖజ్‌రెడ్డి (33), రవి కిరణ్ (10) పరుగులు చేసి జట్టుకు మంచి స్కోర్ అందించారు. రాయల్స్ బౌలర్లలో గిరినాథ్, సాకేత్ రామ్ చెరో రెండు వికెట్లు తీశారు. సింహాద్రి వైజాగ్ లయన్స్, భీమవరం బుల్స్ మధ్య జరగాల్సిన మ్యాచ్ పూర్తిగా వర్షం కారణంగా రద్దు కావడంతో ఇరు జట్లకు చెరో పాయింట్ కేటాయించారు.

## క్లుప్తంగా

### గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలి మృతి

అనకాపల్లి టౌన్: రోడ్డు మీద నడిచి వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో మహిళ మరణించింది. దీనికి సంబంధించి రూరల్ ఎస్‌ఐ రవికుమార్ అందించిన వివరాలిలా ఉన్నాయి. కశింకోట గవరపేటకు చెందిన బొలిశెట్టి వరలక్ష్మి(69) ఆదివారం ఉదయం ఐదు గంటల సమయంలో అనకాపల్లిలో ఉన్న బంధువుల ఇంటికి నడుచుకుంటూ బయలు దేరింది. మార్గమధ్యంలో జాతీయ రహదారి పిసినికాడ గ్రామం వద్ద వెనక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడింది. ఆమెను ఎన్టీఆర్ ఆస్పత్రి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

### ఫార్మా కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవాలి

అచ్యుతాపురం: అచ్యుతాపురం సెజ్‌లో ఫార్మా కంపెనీలో అనుమతులు లేకుండా డ్రగ్స్ తయారీ చేస్తున్న యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.డీఆర్‌ఐ సోదాలు బహిర్గతం చేయాలని కోరారు. అనుమతులు లేకుండా డ్రగ్స్ తయారు చేస్తున్న యాజమాన్యాన్ని అరెస్టు చేసి కంపెనీలు లైసెన్సులు శాశ్వతంగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఫార్మా కంపెనీలన్నిటిలోనూ సోదాలు చేసి అనుమతుల్లేని తయారీదారులు, అందుకు సహకరించిన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

### ఏలేరు కాలువలో లభ్యమైన మృతదేహం గుర్తింపు

కశింకోట: తాళ్లపాలెం శివారు బంగారయ్యపేట గ్రామం వద్ద ఏలేరు కాలువలో లభ్యమైన మృతదేహం కేడీ పేటకు చెందిన లోకవరపు బుచ్చియ్యనాయుడు (32)గా గుర్తించినట్టు ఎస్‌ఐ పి. మనోజ్‌కుమార్ ఆదివారం తెలిపారు. శనివారం మృతదేహాన్ని కనుగొన్నామన్నారు. సుమారు పది రోజుల క్రితం నాయుడు విశాఖ నుంచి తమ గ్రామానికి బైక్‌పై వెళుతూ మాకవరపాలెం మండలం చెట్టుపాలెం వద్ద ఏ కారణంగానో ఏలేరు కాలువలో గల్లంతయ్యాడన్నారు. ఈ నేపథ్యంలో కేడీ పేటలో మిస్సింగ్ కేసు నమోదైందన్నారు. ఈ నేపథ్యంలో చెట్టుపాలెం నుంచి ఏలేరు కాలువలో ప్రవాహ వేగానికి కొట్టుకు రావడంతో మృతదేహాన్ని పడవలో గాలించి బంగారయ్యపేట వద్ద శనివారం వెలికితీసి గుర్తించినట్టు తెలిపారు. ఈ మేరకు మృతదేహానికి పోస్టుమార్టం జరిపించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

### గ్యాస్ సిలిండర్ పేలుడు ఘటనలో మరొకరు మృతి

మహారాణిపేట: ఫిషింగ్ హార్బర్ రోడ్డులో ఇటీవల జరిగిన గ్యాస్ సిలిండర్ పేలుడు ప్రమాదంలో గాయపడిన మరొకరు మృతి చెందారు. దీంతో మృతుల సంఖ్య ఐదుకు పెరిగింది. ఈ నెల 7న హార్బర్ రోడ్డులో గ్యాస్ సిలిండర్ పేలిన సంగతి తెలిసిందే. ఈ ఘటన లో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా, కేజీహెచ్‌కు తరలించిన తర్వాత కొద్దిసేపటికి మరొకరు చనిపోయారు. 15న ఇప్పిలి రంగారావు మరణించారు. శనివారం అర్ధరాత్రి తర్వాత కేజీహెచ్ ప్లాస్టిక్ వార్డులో చికిత్స పొందుతున్న యల్లాజీ గుండెపోటుతో మృతి చెందినట్లు కేజీహెచ్ వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనలో గాయపడిన మరో బాధితుడు నగరంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

# ఈపీడీసీఎల్‌లో బదిలీల బంతాట!

- సర్కిళ్లలో బదిలీలకు సిద్ధమవ్వాలంటూ ఉద్యోగులకు ఆదేశాలు
- ఇప్పటికే ఉద్యోగులకు ఆప్షన్లు ఇవ్వాలంటూ మార్గదర్శకాలు
- కొత్త సర్కిల్‌కి బదిలీ చేస్తే ఉద్యోగ విరమణ వరకూ అక్కడే విధులంటూ షరతు
- ట్రాన్స్‌ఫర్ అయ్యే అవకాశాలు జూనియర్లకే ఎక్కువ ఉండటంతో ఆందోళన
- అభ్యంతరం వ్యక్తం చేస్తున్న ఉద్యోగ సంఘాలు

**ఈపీడీసీఎల్ పరిధిలో..**

| | |
|---|---|
| జూనియర్ అసిస్టెంట్లు | 470 |
| సీనియర్ అసిస్టెంట్లు | 626 |
| టైపిస్ట్/యూడీస్టెనో/ఎల్‌డీ స్టెనో | 66 |
| సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్లు | 107 |

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో గతంలో జరిగిన జిల్లాల విభజనకు అనుగుణంగా ఈపీడీసీఎల్‌లో సర్కిళ్లను విభజించారు. అయితే ఇప్పుడు ఆయా సర్కిళ్లకు అనుగుణంగా ఉద్యోగులను బదిలీ చేసేందుకు మార్గదర్శకాలు జారీ చేయడంతో ఉద్యోగుల్లో కలవరం మొదలైంది. ఈ బదిలీల ప్రక్రియలో జూనియర్లనే లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తమవుతోంది. కొత్తగా బదిలీ అయిన సర్కిల్‌లోనే ఉద్యోగ విరమణ వరకు విధులు నిర్వర్తించాలన్న ప్రభుత్వ షరతుపై ఉద్యోగులు మండిపడుతున్నారు. మరోవైపు కొత్తగా జిల్లాల పునర్విభజన జరగవచ్చని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో.. ఇప్పుడే బదిలీలు చేపట్టవద్దని ఉద్యోగులు కోరుతున్నారు. అయినా అధికారులు ఈ ప్రక్రియను ముందుకు తీసుకెళ్తున్నారు.

**బదిలీ మార్గదర్శకాలపై అసంతృప్తి**

రెండేళ్ల కిందట జరిగిన సర్కిళ్ల పునర్విభజనకు అనుగుణంగా బదిలీలు చేసేందుకు ఈపీడీసీఎల్ అధికార యంత్రాంగం సిద్ధమైంది. గతంలో ఈపీడీసీఎల్ పరిధిలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, ఏలూరుతో కలిపి మొత్తం 5 సర్కిళ్లు ఉండేవి. జిల్లాల పునర్విభజన తర్వాత సర్కిళ్ల సంఖ్య 11కి పెరిగింది. అవి శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, డా.బి.ఆర్. అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు సర్కిళ్లు. అయితే సర్కిళ్లు విభజించినప్పటికీ ఉద్యోగుల విభజన ప్రక్రియ పూర్తి కాకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో బదిలీలు చేపట్టేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు.

**జూనియర్లని బలిచేసేలా మార్గదర్శకాలు.!**

సర్కిళ్ల ప్రకారం ఉద్యోగుల బదిలీలు చేపట్టనున్నట్లు ఇటీవలే మార్గదర్శకాలు విడుదలయ్యాయి. కొత్తగా వచ్చిన సర్కిళ్లకు బదిలీపై వెళ్లాల్సి ఉంటుందని.. ఏ సర్కిల్‌కు వెళ్లాలో నిర్ణయించుకోవాలంటూ ఆప్షన్లు ఇచ్చింది. కొత్తగా ఏర్పాటైన ఆరు సర్కిళ్లలో బదిలీలుండనుండగా.. ఉద్యోగి నేస్తం పోర్టల్‌లో ఆప్షన్లు పెట్టుకోవాలని ఆదేశించారు. ఈ ప్రక్రియలో జూనియర్లనే ఎక్కువగా ట్రాన్స్‌ఫర్ చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నట్లు సమాచారం. కూటమి ప్రభుత్వం విధించిన షరతు జూనియర్లలో మరింత ఆందోళన రేపుతోంది. ఈ ప్రక్రియలో సీనియర్లకు మాత్రమే ఆప్షన్లు ఎంచుకునే అవకాశం ఇచ్చారు. దీంతో 90 శాతానికి పైగా సీనియర్లు బదిలీ నుంచి తప్పించుకుంటున్నారనే వాదన వినిపిస్తోంది. కొద్దిమంది సీనియర్లు మాత్రమే అనారోగ్యం వంటి కారణాలతో సొంత జిల్లాకు బదిలీ అయ్యేందుకు మొగ్గు చూపుతున్నారు. దీంతో జూనియర్లకే ఎక్కువగా మార్పులు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కాగా.. బదిలీ అయిన ఉద్యోగి తన ఉద్యోగ విరమణ వరకు అదే సర్కిల్‌లో పనిచేయాలని ప్రభుత్వం నిబంధన విధించింది. ఈ షరతు వల్ల జూనియర్లు పదోన్నతులు పొంది ఉన్నత స్థానాలకు వెళ్లే అవకాశాలు కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఈపీడీసీఎల్ ప్రధాన కార్యాలయం

**పునర్విభజన జరిగితే మళ్లీ బదిలీలు చేస్తారా?**

వచ్చే వారం పది రోజుల్లో బదిలీల ప్రక్రియ నిర్వహించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. అయితే ఉద్యోగ సంఘాలు ఈ నిర్ణయాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నాయి. జూనియర్లకు ఇబ్బందులకు గురి చేయకుండా.. పాత పద్ధతిలోనే బదిలీలు చేపట్టాలని, బదిలీలలో పారదర్శకత పాటించాలని కోరుతున్నాయి. మరోసారి జిల్లాల పునర్విభజన జరిగితే కొత్త సర్కిళ్లు ఏర్పడతాయని, అప్పుడు మళ్లీ బదిలీలు చేయాల్సి ఉంటుందని ఉద్యోగులు వాదిస్తున్నారు. ఈ నేపథ్యంలో బదిలీల ప్రక్రియను నిలిపివేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# ఉన్మాదుల్లా టీడీపీ ఎమ్మెల్యేలు

**వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మంచ నాగ మల్లేశ్వరి ఆగ్రహం**



సాక్షి, విశాఖపట్నం: టీడీపీ ఎమ్మెల్యేలు మహిళల పట్ల అమానుషంగా ప్రవర్తిస్తున్నారని, వారి వేధింపులకు భయపడి మహిళలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, మరికొందరు రాష్ట్రాన్ని విడిచి వెళ్ళిపోతున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి, దళిత మహిళా నేత మంచ నాగ మల్లేశ్వరి మండిపడ్డారు. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు.కొంతమంది టీడీపీ ఎమ్మెల్యేలు లైంగికంగా వేధిస్తున్నారని, పనులు కావాలంటే పక్కన పడుకోవాలని మహిళలను వేధిస్తున్నారని ఆరోపించారు. టీడీపీ ఎమ్మెల్యే కూన రవికుమార్ ఒక దళిత మహిళా ఉద్యోగినిని లైంగికంగా వేధించారని, అందరి ముందు అవమానించారని ఆమె అన్నారు. మరో టీడీపీ ఎమ్మెల్యే నజీర్ కారణంగా ఒక మహిళ ఆత్మహత్య చేసుకుందని, ఎమ్మెల్యే ఆదిమూలం వేధింపులకు భయపడి ఒక మహిళ రాష్ట్రం విడిచి వెళ్లిపోయిందని ఆమె పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లా చోడవరం టీడీపీ ఎమ్మెల్యే రాజు తన పార్టీ నాయకుడు చెప్పిన వారికి సీటు ఇవ్వలేదనే కారణంతో ఒక మహిళా ఉద్యోగినిని అందరి ముందు బండ బూతులు తిట్టారని, దాంతో ఆమె స్పృహ కోల్పోయి పడిపోయారని ఆమె తెలిపారు. ఇలా ప్రజా ప్రతినిధులే మహిళలను వేధిస్తుంటే, ఆ పార్టీలోని నాయకులు, కార్యకర్తలు మరింతగా అఘాయిత్యాలకు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. దళిత మహిళలపై దాడులు, వేధింపులు జరుగుతున్నా దళిత హోంమంత్రి వంగలపూడి అనిత నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని, ఆ కామ పిశాచులను అరెస్ట్ చేయడం లేదని ఆమె ఆరోపించారు. అనంతపురంలో 14 ఏళ్ల మైనర్ బాలికపై 14 మంది టీడీపీ కార్యకర్తలు లైంగికదాడికిపాల్పడి హత్య చేస్తే, వారిపై చర్యలు లేవని, కనీసం హోంమంత్రి బాధిత మహిళ కుటుంబాన్ని పరామర్శించలేదని ఆమె అన్నారు. ఇలాంటి చేతగాని హోంమంత్రిగా అనిత అనర్హురాలని, తక్షణమే రాజీనామా చేయాలని ఆమె డిమాండ్ చేశారు. మహిళలపై దాడులు, లైంగిక వేధింపులు, అత్యాచారాలకు పాల్పడిన టీడీపీ నాయకులు, ఎమ్మెల్యేలు, కార్యకర్తలపై ఫిర్యాదులను సీరియస్‌గా తీసుకోవాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా దళితులంతా ఉద్యమిస్తామని ఆమె హెచ్చరించారు.

# 'వ్యాపారులకు ఆర్టీసీ స్థలాలు ధారాదత్తం'

అనకాపల్లి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ స్థలాలను బడా వ్యాపారవేత్తలకు ధారాదత్తం చేస్తోందని ఏపీ పీటీడీ (ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ కార్యదర్శి భాసూరు కృష్ణమూర్తి విమర్శించారు. సీపీఎం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం 2014లో కూడా ఇలాగే ఆర్టీసీ స్థలాలను అనుకూల వ్యాపారవేత్తలకు కట్టబెట్టిందన్నారు. తాజాగా విజయవాడ నగరం నడిబొడ్డున ఉన్న ఆర్టీసీ స్థలాన్ని లులూ షాపింగ్ మాల్‌కు కేటాయిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీవో 137ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సుమారు నాలుగు వందల కోట్ల రూపాయలు విలువ చేసే 4.15 ఎకరాల స్థలం లులూ షాపింగ్ మాల్‌కు కట్టబెట్టడం దారుణమన్నారు. ఇదే షాపింగ్ మాల్ నగర శివారు ప్రాంతంలో ఏర్పాటు చేస్తే ఆ ప్రాంతమంతా అభివృద్ధి చెందుతుందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కావస్తున్నా డీఏ బకాయిలను ఇంతవరకు చెల్లించకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టి ప్రైవేట్ ఆపరేటర్లకు అప్పజెప్పడం చూస్తుంటే రానున్న కాలంలో సంస్థను ప్రైవేటీకరణ వైపు నడిపించే యోచనలో ఉందని తెలుస్తోందన్నారు. సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు లోవరాజు, యూనియన్ నాయకులు తాతాలు, ఎస్.వి.రమణ, డి.ఎల్ రాజు, ఐఎస్ బాబు, వై.వి.ఎస్ కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీ పీటీడీ (ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ కార్యదర్శి కృష్ణమూర్తి

## తాతయ్యనాయుడుకు ఉత్తమ అవార్డు



అవార్డు అందుకుంటున్న జి.తాతయ్య నాయుడు

పాయకరావుపేట: శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ జి.తాతయ్య నాయుడు ఉత్తమ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ అవార్డును ఆంధ్ర విశ్వ విద్యాలయ వైస్ చాన్సలర్ రాజశేఖర్ చేతుల మీదుగా అందుకున్నారని అంతేకాక ఆయనను జిల్లా ఎన్ఎస్ఎస్ నోడల్ ఆఫీసర్‌గా నియమించారని కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎ.రామకృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా స్పేసెస్ డిగ్రీ కళాశాల కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ జి.తాతయ్య నాయుడు మాట్లాడుతూ తమ కళాశాల యాజమాన్యం, విద్యార్థుల సహకారంతో గత విద్యా సంవత్సరంలో చేపట్టిన సేవా కార్యక్రమాలకు ఈ అవార్డు పొందడం ఆనందనీయమని తెలిపారు. అవార్డు పొందిన నాయుడిని ఆంధ్రా విశ్వ విద్యాలయ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ఆచార్యులు డి.సింహాచలం విద్యా సంస్థల అధినేత నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్ అభినందించారు.

## తల్లిదండ్రులకు చిన్నారుల అప్పగింత



చిన్నారులను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

కొమ్మాది: పీఎంపాలేనికి చెందిన ఐదుగురు చిన్నారులు తల్లిదండ్రులకు చెప్పకుండా ఆదివారం రుషికొండ బీచ్‌కు వచ్చారు. వర్షం పడుతున్నా వారు ఆ ప్రాంతంలో తిరుగుతుండడం చూసి మెరైన్ పోలీసులు వారిని ప్రశ్నించారు. తాము పీఎంపాలెం నుంచి వచ్చామని కె.హర్షిన్, ఎ.హాశ్వంత్, పి.కల్యాణి, ఎ.హర్షిత, ఎ.వంశీ తెలిపారు. పోలీసులు వారి తల్లిదండ్రుల వివరాలు తెలుసుకుని సమాచారం అందించి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి పిల్లలను అప్పగించారు.

# పోలీస్ కార్యక్రమంలో ప్రొటోకాల్ ఉల్లంఘన

- శిలాఫలకంపై కనిపించని సర్పంచ్, ఎంపీపీల పేర్లు
- దళిత మహిళలు కావడంతోనే అవమానించారని ఆవేదన

నక్కపల్లి: పోలీస్ శాఖ కార్యక్రమంలో ప్రొటోకాల్ ఉల్లంఘన జరిగింది. మండల కేంద్రం నక్కపల్లిలో హెటిరో కంపెనీ యాజమాన్యం సమకూర్చిన రూ.2.50 కోట్ల సీఎస్ఆర్ నిధులతో ఆధునిక వసతులతో కూడిన పోలీస్ స్టేషన్ భవనాన్ని నిర్మిస్తున్నారు. దీనికి సంబంధించిన శంకుస్థాపన కార్యక్రమం ఆదివారం జరిగింది. కార్యక్రమానికి హోం మంత్రి వంగలపూడి అనిత, డీజీపీ హరిష్ కుమార్ గుప్తా ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. హోం మంత్రి శంకుస్థాపన చేయగా శిలాఫలకాన్ని డీజీపీ, హోంమంత్రులు ఆవిష్కరించారు. శిలాఫలకంపై గ్రామ ప్రథమ పౌరురాలు, స్థానిక సర్పంచ్ జయరత్నకుమారి, మండల ప్రథమ పౌరురాలు, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ పేర్లు వేయలేదు. శిలాఫలకంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఇన్‌చార్జ్ మంత్రి కొల్లు రవీంద్ర, శాసనమండలి ప్రతిపక్షనేత బొత్ససత్యనారాయణ, ఎంపీ సీఎం రమేష్, రాజ్యసభ సభ్యుడు గొల్లబాబూరావు, ఎంఎల్‌సీ వేపాడ చిరంజీవి, జెడ్పీ చైర్మన్ జల్లిపల్లి సుభద్ర పేర్లు వేశారు. భవనం నిర్మిస్తున్న స్థానిక సర్పంచ్ , మండల పరిషత్ అధ్యక్షురాలు, జిల్లా ప్రాదేశిక సభ్యురాలు పేర్లు వేయకపోవడం గమనార్హం. దళిత మహిళలం కావడంతోనే మాపై చిన్నచూపు చూసి శిలాఫలకంలో తమ పేర్లు వేయలేదంటూ వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ప్రధానమంత్రి పాల్గొనే అధికారిక కార్యక్రమంలో సైతం స్థానిక సర్పంచ్‌కు ప్రొటోకాల్ పాటిస్తారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో నక్కపల్లిలో జరిగిన సీఎం చంద్రబాబు పాల్గొన్న అధికారిక కార్యక్రమంలో అప్పటి మహిళా సర్పంచ్‌ను స్టేజీపైకి ఆహ్వానించారని వారు గుర్తు చేస్తున్నారు. శిలాఫలకంలో ప్రొటోకాల్ పాటించకపోవడం, సర్పంచ్, ఎంపీపీ, జెడ్పీటీసీ పేర్లు వేయకపోవడంపై సీఐ కుమార స్వామి వద్ద ప్రస్తావించగా కలెక్టర్ కార్యాలయం నుంచి తీసుకున్న ప్రొటోకాల్ జాబితా ప్రకారమే శిలాఫలకాన్ని తయారు చేయడం జరిగిందన్నారు. గతంలో పలు ప్రాంతాల్లో జరిగిన ఇటువంటి కార్యక్రమాల్లో స్థానిక సర్పంచ్‌ల పేర్లు వేయలేదన్నారు.



స్థానిక ప్రజాప్రతినిధుల పేర్లు లేకుండా ఏర్పాటు చేసిన శిలాఫలకం

# అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి పోరాటం

- అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా 10వ మహాసభలో రాష్ట్ర కార్యదర్శి చంద్రావతి
- జిల్లా కమిటీ నూతన కార్యవర్గం ఎన్నిక



సభలో పాల్గొన్న సిటు సభ్యులు



సిటు మహాసభలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి చంద్రావతి

సబ్బవరం: అంగన్‌వాడీలకు కనీస వేతనాలు అమలు చేసి, వారి సమస్యలను పరిష్కరించకపోతే పోరాటానికి సిద్ధమని సిటు రాష్ట్ర కార్యదర్శి చంద్రావతి హెచ్చరించారు. స్థానిక సీతారామ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్( సిటు) 10వ జిల్లా మహాసభలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ వర్కర్లు గ్రామాల్లో మాతా శిశు మరణాలను తగ్గించి పిల్లలకు కౌమార విద్యను అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి అంగన్‌వాడీ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించకపోవడం శోచనీయమన్నారు. గత ప్రభుత్వంలో 42 రోజుల పాటు సమ్మె చేయగా, వేతనాల పెంపు, గ్రాట్యుటీ చట్టాల అమలు హామీలు అమలుకు నోచుకోలేదన్నారు. అప్పుడు ప్రతిపక్షంగా ఉన్న టీడీపీ నేతలు సమ్మె శిబిరాలకు వచ్చి అధికారంలోకి రాగానే సమస్యలు పరిష్కరిస్తామని, వేతనాల పెంపు, గ్రాట్యుటీ అమలు హామీలు గుప్పించి, అధికారంలోకి వచ్చి 14 నెలలు గడిచినా కనీసం పట్టించుకోవట్లేదని ఆక్షేపించారు. అంగన్‌వాడీల కనీస విధులతోపాటు, అదనపు బాధ్యతలు, యాప్‌ల పేరిట వేధించడం సరికాదన్నారు. సమస్యల పరిష్కారానికి పోరాటాన్ని ఉధృతం చేస్తామని, అంగన్‌వాడీలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిటు రాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు, జిల్లా కోశాధికారి వీవీ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

**నూతన కార్యవర్గం ఎన్నిక**

ఈ మహాసభలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షురాలిగా జి.కుమారి, అధ్యక్షురాలిగా ఎం.దుర్గారాణి, ప్రధాన కార్యదర్శిగా నాగశేషు, కోశాధికారిగా వీవీ రమణమ్మ ఎన్నికయ్యారు. పాలకవర్గ సభ్యులుగా ఎస్.వరలక్ష్మి, కె.రామలక్ష్మి, పి.భవాని, ఆర్.మహాలక్ష్మి, తనూజ, ఎం.రమణి, చిన్నమ్ములు, సత్యవేణి, మంగ, టి.సంతోషి, అంజలి, సీహెచ్ రామలక్ష్మితో పాటు మరో 11 మంది సభ్యులను ఎన్నుకున్నారు.

# రక్త 'పరీక్ష'లే..!

- కేజీహెచ్‌లో రక్త పరీక్షలకు అంతరాయం
- రీజెంట్స్ లిక్విడ్ లేక నిలిచిన ఏబీజీ పరీక్షలు
- పట్టించుకోని కూటమి సర్కార్

మహారాణిపేట: ఉత్తరాంధ్రతో పాటు పలు రాష్ట్రాల ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న కింగ్ జార్జ్ హాస్పిటల్ (కేజీహెచ్)లో ముఖ్యమైన రక్త పరీక్షలు నిలిచిపోయాయి. దీనివల్ల పేద రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా కిడ్నీ, ఆస్తమా, ఊపిరితిత్తుల వ్యాధులను నిర్ధారించే ఆర్టీరియల్ బ్లడ్ గ్యాస్ (ఏబీజీ) పరీక్షలు గత కొన్ని రోజులుగా జరగడం లేదు. ఈ పరీక్షలకు అవసరమైన 'రీజెంట్స్ లిక్విడ్' సరఫరా లేకపోవడమే ఈ పరిస్థితికి ప్రధాన కారణం. గతంలో ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య మౌలిక సదుపాయాల సంస్థ నుంచి ఈ లిక్విడ్ సరఫరా అయ్యేది. అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ సరఫరా నిలిచిపోయిందని తెలుస్తోంది. బయట నుంచి కొనుగోలు చేయడానికి కేజీహెచ్‌లోని కొంతమంది వైద్యాధికారులు ఇష్టపడకపోవడంతో రోగులు నానా ఇబ్బందులు పడుతున్నారు.



**రోగుల ఇబ్బందులు**

ఏబీజీ పరీక్షలో రక్తంలో ఆక్సిజన్, కార్బన్ డయాక్సైడ్ శాతాలను విశ్లేషిస్తారు. కిడ్నీ వైఫల్యం, గుండె లోపాలు, డయాబెటిస్, ఆస్తమా వంటి వ్యాధులను నిర్ధారించడానికి ఈ పరీక్షలు అత్యంత కీలకం. గతంలో కేజీహెచ్‌లో రోజుకు 40 నుంచి 80 మంది రోగులకు ఈ పరీక్షలు చేసేవారు. బయట ల్యాబరేటరీలలో ఈ పరీక్షకు రూ. 900 నుంచి రూ. 1,300 వరకు ఖర్చవుతుంది. ఆర్థిక స్తోమత లేని పేద రోగులు ఈ పరీక్ష కోసం ఎదురుచూస్తున్నారు.

**యంత్రాలకు మరమ్మతులే కారణం**

ఈ విషయంపై కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ. వాణి మాట్లాడుతూ, ఏబీజీ పరీక్షలకు స్వల్ప అంతరాయం కలిగిందని తెలిపారు. యంత్రాలకు మరమ్మతులు జరుగుతున్నాయని, రోగులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. అయితే 'రీజెంట్స్ లిక్విడ్' లేకపోవడం గురించి మాత్రం ఆమె స్పష్టమైన సమాధానం ఇవ్వకుండా దాటవేశారు.

# ఎమ్మెల్యే కూనపై చర్య తీసుకోవాలి

**నిరసన తెలిపిన మాలమహానాడు**

తగరపువలస: శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలంలోని కేజీబీవీ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తిస్తున్న దళిత మహిళ సౌమ్యను వేధిస్తున్న ఎమ్మెల్యే కూన రవికుమార్‌పై చర్యలు తీసుకోవాలని మాలమహానాడు నాయకులు డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే తీరుకు నిరసనగా ఆదివారం భీమిలి మండలం తాళ్లవలసలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాల మహానాడు వ్యవస్థాపక కార్యదర్శి భాగం గోపాలరావు మాట్లాడుతూ ఆముదాలవలస ఎమ్మెల్యే కూన తన సామాజిక వర్గానికి చెందిన మహిళను ప్రిన్సిపాల్‌గా నియమించుకోవడానికి దళిత ప్రిన్సిపాల్ సౌమ్యను బలి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. రాజ్యాంగం ప్రకారం రిజర్వేషన్లు పొంది రాష్ట్రంలో 30 మంది ఎమ్మెల్యేలు, నలుగురు ఎంపీలు ఉన్నప్పటికీ దళితులపై దాడులు జరుగుతున్నప్పుడు వారు స్పందించకపోవడం శోచనీయమన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 79 ఏళ్లు అవుతున్నా.. నేటికీ దళితులను సామాజికంగా అణగదొక్కుతూనే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సౌమ్యపై తప్పుడు ఆరోపణలు చేసి ఆమె బదిలీకి కారణమైన కూన రవికుమార్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సౌమ్యను అదే విద్యాసంస్థలో కొనసాగించాలని కోరారు. మాల మహానాడు నియోజకవర్గ అధ్యక్షుడు బోని సన్నిబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సియ్యాద్రి రాంబాబు, యాగాటి రామారావు, బోని ప్రసాద్, నరసింగరావు, లోకేష్, ఎజ్జల దాసు, రామారావు, టి.సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

# నిర్వాసితులను ఆదుకోవడంలో ప్రభుత్వాలు విఫలం

**సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ**



చింతూరులో మాట్లాడుతున్న సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి బేబీ

చింతూరు: పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సర్వస్వం త్యాగం చేసిన నిర్వాసితులకు పరిహారం ఇవ్వడంతో పాటు పునరావాసం కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయలని సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ విమర్శించారు. పార్టీ రాజ్యసభ ఫ్లోర్‌లీడర్ జాన్‌బ్రిట్టాస్‌తో కలసి పోలవరం ముంపు మండలాల పర్యటనకు వచ్చిన ఆయన ఆదివారం చింతూరులో విలేకర్లతో మాట్లాడారు. ప్రాజెక్టు నిర్మాణంలో అత్యంత కీలకమైన పునరావాసానికి రూ.33 వేల కోట్ల నిధులు మంజూరు చేయడంలో కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం తగదన్నారు. పునరావాస కాలనీల్లో మౌలిక వసతులు లేక నిర్వాసితులు తీవ్ర అవస్థలు పడుతున్నారని, తమ పర్యటనల్లో గుర్తించిన సమస్యలపై లోక్‌సభ, రాజ్యసభలో కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీస్తామని ఆయన తెలిపారు. నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో గిరిజనులను సంఘటితం చేసి ఉద్యమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. పోలవరం నిర్వాసిత కాలనీల్లో ఎక్కడచూసినా నాసిరకం నిర్మాణాలు కనిపిస్తున్నాయన్నారు, తాగునీరు, విద్య, వైద్యం, రవాణా, ఉపాధి వంటి అవసరాలు లేక నిర్వాసితులు ఇబ్బందులు పడుతున్నారని జాన్‌బ్రిట్టాస్ అన్నారు.

వీఆర్‌పురం: రూ.వేలకోట్లతో రాజధాని నిర్మాణ పనులు చేపడుతున్న కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు పోలవరం నిర్వాసితులగోడు పట్టించుకోవడం లేదని సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ, రాజ్యసభ సభ్యులు ఫ్లోర్ లీడర్ జాన్ బ్రిట్టాస్ ఆరోపించారు. రామవరంలో జరిగిన పార్టీ బహిరంగ సభలో వారు మాట్లాడారు. పోలవరం నిర్వాసితుల కాలనీ ఇళ్లు నిర్మించి నాలుగేళ్లు కాకముందే శ్లాబ్‌లు కారిపోతున్నందున బరకాలు వేసుకోవాల్సి వస్తోందన్నారు. ప్రాజెక్ట్ నిర్మాణానికి భూములు కేటాయించిన రైతులకు ఎకరాకు రూ.25 లక్షల వరకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి బొంప్పెన కిరణ్ ఎం వాణిశ్రీ, రాష్ట్ర నాయకులు తుల సీదాసు, బలరాం తదితరులు పాల్గొన్నారు.

ఎటపాక: పోలవరం నిర్వాసితుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు లోకనాథం విమర్శించారు. మండలంలోని నర్సింగపేట పోలవరం నిర్వాసిత కాలనీలో ఆదివారం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ పోలవరం జాతీయ ప్రాజెక్ట్ కావడంతో నిర్వాసితుల సమస్యలు కూడా జాతీయ సమస్యగా గుర్తించాలని సూచించారు. కాంటూరు లెక్కలు కాకి లెక్కలని, నిర్వాసితులందరికీ న్యాయం చేసిన తరువాతనే ప్రాజెక్టు నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. కాలనీల్లో నిర్వాసితులు బతుకులు దుర్భరంగా మారాయని, నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి ఉద్యమాలే సరైన మార్గమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిల్లో సురేంద్ర, బొప్పెన కిరణ్, మర్లపాటి నాగేశ్వరరావు, లోతా రామారావు, మట్ల శ్రీవాణి, ఐవీ, మేకల నాగేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు లోకనాథం

## క్లుప్తంగా

### ఆత్మహత్యకు యత్నించిన మహిళ మృతి

కశింకోట: మండలంలోని జమాదులపాలెంలో క్రిమిసంహారక మందు తాగి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న మహిళ మృతి చెందినట్లు ఏఎస్‌ఐ రమణమ్మ ఆదివారం తెలిపారు. కుటుంబ కలహాల కారణంగా వారం రోజుల క్రితం వియ్యపు రాజేశ్వరి (26) ఆత్మహత్యకు ప్రయత్నించిందన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉండగా ఆమెను అనకాపల్లి ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారన్నారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

### దివ్యాంగులకు నిత్యావసర సరుకుల వితరణ


గునుపూడిలో దివ్యాంగులకు నిత్యావసర సరకులు ఇస్తున్న దివ్యాంగుడు నూకరాజు

నాతవరం: గునుపూడి గ్రామంలో ఆదివారం దివ్యాంగులు నిరుపేదలకు విశ్రాంత ఎంఈవో తాడి అమృత్‌కుమార్ మనవడు జన్మదిన సందర్భంగా నిత్యవసర సరుకులు, దుస్తులు పంపిణీ చేశారు. గతంలో ఇక్కడ ఎంఈవోగా పని చేసిన అమృత్‌కుమార్ తన కుమారుడు తాడి చైతన్య వికాస్ విజయసిరిల దంపతుల కుమారుడు అయాన్ విఖ్యాత్ జన్మదినం సందర్భంగా ఆదివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గునుపూడి గ్రామానికి చెందిన దారా నూకరాజు ఆధ్వర్యంలో దివ్యాంగులైన నిరుపేదలకు సుమారుగా 50 మందికి నిత్యవసర సరుకులు, దుస్తులు పంపిణీ చేశారు. భారీ వర్షాలు కురవడంతో నూకరాజు స్వయంగా దివ్యాంగుల ఇళ్లకు ఆటోలపై నిత్యవరసరుకులు తీసుకెళ్లి అందజేశారు.

### నేటి నుంచి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు


ఎమ్మెల్యే కప్ టీ-షర్టులను అందజేస్తున్న కబడ్డీ అసోసియేషన్ సభ్యులు

మునగపాక: మండలంలోని నాగులాపల్లిలో ఈ నెల 18, 19, 20 తేదీల్లో రాష్ట్ర స్థాయి మహిళలు, పురుషుల కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఉరుకుటి శ్రీనివాసరావు తెలిపారు. ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ జన్మదినం సందర్భంగా జరిగే ఈ పోటీలను విజయవంతం చేయాలన్నారు. ఆదివారం ఇందుకు సంబంధించిన టీ షర్టులను ఆయన అందజేశారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర స్థాయిలో కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రోజూ ఫ్లడ్‌లైట్ల వెలుతురులో పోటీలు జరుగుతాయన్నారు. వర్షం వల్ల పోటీలకు అంతరాయం లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో పోటీల నిర్వాహకులు దొడ్డి శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, నూకాలయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఆశ్రమ పాఠశాల విద్యార్థినుల నృత్య ప్రదర్శన


నృత్య ప్రదర్శన పోటీల్లో ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు

అచ్యుతాపురం రూరల్: సత్య సాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పుట్టపర్తిలో నిర్వహించిన నృత్య ప్రదర్శన పోటీల్లో అచ్యుతాపురం ఇంటిగ్రేటెడ్ ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు పాల్గొన్నారు. ఉక్కునగరం సత్యసాయి సేవా సమితి సభ్యులు రమణ, కృష్ణకుమారి ఆధ్వర్యంలో వీరు నృత్య ప్రదర్శన చేశారు. రాష్ట్రంలో 25 వేల మంది నృత్య కళాకారులు ఇక్కడ ప్రదర్శనలో పాల్గొన్నట్లు పాఠశాల వ్యవస్థాపకుడు పి.ఎస్.టి.పట్నాయక్ ఆదివారం తెలిపారు. పాఠశాల విద్యార్థినులు మానస, దేవిక, రేష్మ, కనకమహాలక్ష్మి, స్మయిత, ప్రణయ్‌లను ఆయన అభినందించారు.

# శారదానదిపై మృత్యుగండం

- ప్రమాదకరంగా దోనె ప్రయాణం
- వరదొస్తే రాకపోకలు బంద్
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతులు
- నెరవేరని కూటమి ప్రభుత్వ హామీ


కశింకోటలోని గవరపేట వద్ద శారదానదిపై దోనె ప్రయాణాలు

కశింకోట: వానొచ్చినా.. వరదొచ్చినా రైతులు అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని దోనె ప్రయాణం చేయాల్సిందే.. ఏ మాత్రం మునిగినా ఒడ్డుకు చేరుతామన్న భరోసా ఉండదు. కశింకోట వద్ద గవరపేటలో శారదా నదిపై వంతెన నిర్మించక **దశాబ్దాలుగా** తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. **గత** వైఎస్సార్‌సీపీ హయాంలో ఇక్కడ **వంతెన నిర్మాణ** పనులు చేపట్టినప్పటికి కరోనా, **నదిలో నీరు చేర**డం, ఇతర కారణాల వల్ల పనులు **అర్థాంతరంగా** నిలిచిపోయాయి. ఆ తర్వాత ఇక్క**డ వంతెన నిర్మా**ణానికి కూటమి ప్రభుత్వం సార్వత్రి**క ఎన్నికల్లో** హామీ ఇచ్చి ఏడాది గడిచినప్పటికీ **ఆచరణలో** మాత్రం 'ఎక్కడ వేసిన గొంగలి అక్కడే' **అన్న** చందంగా ముందుకు కదలడం లేదు.

**గతంలో పలువురు మృత్యువాత**

కశింకోటలోని గవరపేట ప్రాంత రైతుల **పొలాలు,** పశువుల పాకలు అత్యధిక శాతం శారదా **నది అవ**తల ఉన్నాయి. దీంతో నిత్యం వాటికి **చేరుకొని** వ్యవసాయ కార్యకలాపాలు, పశు సంరక్షణ**, పాల** సేకరణ వంటి కార్యకలాపాలు సాగించుకో**వడానికి** నదిని దాటాల్సి ఉంటుంది. దీనికి నది**పై తాటి** దోనెలను వినియోగిస్తారు. ఇవి ఒక్కొ**క్కసారి** మునిగి ప్రమాదాలకు గురవుతుంటాయి. గ**తంలో** దోనెలు మునిగి, ఈత ద్వారా పొలాలకు చే**రుకోవ**డానికి నదిలో దిగి గల్లంతై పలువురు రైతులు మృతి చెందిన సంఘటనలున్నాయి. 1977 వరదల అనంతరం దోనె మునిగి ఇద్దరు రైతులు మృత్యువాత పడ్డారు. పలువురు ప్రాణాలతో బయట పడ్డారు. ఆ తర్వాత పలు ప్రమాదాల్లో రైతులు మృతి చెందారు. పలుసార్లు దోనెలు మునిగి ప్రమాదాల నుంచి అదృష్టవశాత్తు బయట పడిన సంఘటనలు అనేకం ఉన్నాయి. అయినప్పటికి గత్యంతరం లేక ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ దోనెలపై నిత్యం రాకపోకలు సాగించక తప్పని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

**వైఎస్సార్‌సీపీ హయాంలో నిధుల మంజూరు**

నది ప్రవాహం అధికమైతే దోనెలు కూడా నిలిపివేస్తారు. దీంతో గ్రామ శివారులో వంతెన మీదుగా సుమారు మూడు కిలోమీటర్ల దూరం నడిచి పొలాలకు చేరుకోవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. దీని దృష్ట్యా ఇక్కడ వంతెన నిర్మించాలని చాలా కాలంగా రైతులు అధికారులు, ప్రజా ప్రతినిధులను కోరుతూ వచ్చారు. ఈ నేపథ్యంలో గత వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.2.70 కోట్లు మంజూరు చేసి మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో 2020 జనవరిలో పనులు చేపట్టారు. రూ.80 లక్షలు వెచ్చించి భూ స్థాయి వరకు కాంక్రీట్‌తో 9 స్తంభాలను నిర్మించారు. ఈ నేపథ్యంలో కరోనా రావడం, నదిలో నీరు నిల్వ ఉండిపోవడం, ఇతర కారణాల వల్ల పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఇక అప్పటి నుంచి పనులు ముందుకు సాగలేదు.




### నెరవేరని స్పీకర్ అయ్యన్నపాత్రుడు హామీ

గత సార్వత్రిక ఎన్నికల ముందు వంతెన నిర్మించి పూర్తి చేయడానికి కూటమి నాయకులు హామీ ఇచ్చారు. అంతకు ముందు టీడీపీ హయాంలో మంత్రిగా చింతకాయల అయ్యన్నపాత్రుడు వంతెన నిర్మాణానికి హామీ **ఇచ్చారు. ఇప్పు**డు కూటమి అధికారంలోకి **వచ్చాక శాసన స**భ స్పీకర్‌గా కశింకోట వచ్చిన **అయ్యన్న పాత్రు**డు గతంలో తాను ఇచ్చిన **హామీ మేరకు వం**తెన నిర్మాణం పూర్తి కావడా**నికి కృషి చేయాల**ని ఈ సందర్భంగా జరిగిన **సభలో ఎమ్మెల్యే** కొణతాల రామకృష్ణకు **సూచించారు. దీంతో** అందుకు ఆయన సుము**ఖత వ్యక్తం చేశారు.** అయితే వంతెన నిర్మాణం **మాత్రం ఇప్పటి వ**రకు ఇసుమంత కూడా **ముందుకు సాగలేదు.** దీంతో రైతులు తీవ్ర **నిరాశ చెందుతున్నారు.** ఇప్పటికైనా తమ **ఇబ్బందులు గుర్తించి** కూటమి ప్రభుత్వం **ఇచ్చిన హామీ మేరకు** వంతెన నిర్మాణానికి **చర్యలు తీసుకొని తమ క**ష్టాలను కడతేర్చాలని **రైతులు కోరుతున్నారు.**

### నదిని దాటడానికి ఇబ్బందులు



గవరపేట వద్ద శారదా నదిపై వంతెన లేక నదిని దాటడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఒక్కొక్కసారి దోనె మునిగి ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినా గత్యంతరం లేక బిక్కుబిక్కుమంటూ దోనె ప్రయాణాలు చేసి వ్యవసాయ కార్యకలాపాలు సాగించాల్సి వస్తోంది. రైతుల ఇబ్బందులు గుర్తించి అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి.

– వేగి సత్యనారాయణ, రైతు, కశింకోట

### ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు


శ్రీకృష్ణాష్టమి వేడుకలో 82వ వార్డు కార్పొరేటర్ సునీత జానకీరామరాజు

అనకాపల్లి టౌన్: పట్టణంలో విజయరామరాజు పేట యాదవ సంక్షేమ సంఘం, కృష్ణ యువజన సంఘం సంయుక్త ఆధ్వర్యంలో రెండో రోజైన ఆదివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత జానకీరామరాజు దంపతులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమలో ఆలయ కమిటీ సభ్యులు బొబ్బిలి అప్పారావు, అప్పారావు, బొట్టా చిన్నియాదవ్, బొబ్బిలి గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

### ఉప్పొంగిన శారదా నది


కశింకోట వద్ద పెరిగిన శారదా నది నీటి మట్టం

కశింకోట: ఎడతెరిపిలేని వర్షానికి స్థానిక శారదా నది ఉప్పొంగి ప్రవహించింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల వల్ల నదిలో వరద నీరు చేరి ప్రవహిస్తోంది. పంట భూములకు నది నుంచి గ్రోయిన్ల ద్వారా సాగు నీరు మెరుగు పడగలదని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

### ఆరు మద్యం సీసాలు స్వాధీనం

కశింకోట: స్థానిక గవరపేటలో విక్రయించడానికి తీసుకెళుతున్న ఆరు మద్యం క్వార్టర్ సీసాలను ఆదివారం స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ పి. మనోజ్‌కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా నిందితుడు కె. మహాలక్ష్మినాయుడును అరెస్టు చేశామన్నారు.

## రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ


ఎన్టీఆర్ ఆస్పత్రిలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేస్తున్న జర్నలిస్టులు

అనకాపల్లి టౌన్: ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయూడబ్ల్యూజే) 69వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఎన్టీఆర్ ఆస్పత్రిలో రోగులకు, బాలింతలకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అనకాపల్లి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్, ఆస్పత్రి డాక్టర్ కవిత పాల్గొని వీటిని అందజేశారు. సీఐ మాట్లాడుతూ నిరంతరం ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉంటూ సమాజ శ్రేయస్సే ధ్యేయంగా పనిచేస్తున్న జర్నలిస్టుల సేవలు వెలకట్టలేనివన్నారు. కార్యక్రమంలో అనకాపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మళ్ల భాస్కరరావు, భీమరశెట్టి గణేష్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు చాగంటి సర్వారావు(అవ్వ), రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మద్దాల రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు పెంటకోట జోగినాయుడు, జర్నలిస్టులు బొడ్డపు కిరణ్, రమణాజీ, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

## సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


కలుసుకున్న పూర్వ విద్యార్థులు


గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న పూర్వ ప్రిన్సిపాల్ షరీఫ్

కోటవురట్ల: పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయికతో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణం పులకించింది. విద్యార్థుల పలకరింపులను పరవశంగా ఆలకించింది. 1991–92 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం అదే చదువులమ్మ తల్లి చెంత కలుసుకున్నారు. ఉద్యోగ, ఉపాధి రీత్యా పలు ప్రాంతాల్లో స్థిరపడి ఒత్తిళ్ల మధ్య యాంత్రిక జీవనం గడుపుతున్న వారంతా ఆనాటి మధుర స్మృతులు గుర్తుకురాగా చిన్నపిల్లల్లా మారిపోయారు. మనసంతా సంతోషంతో వెలిగిపోయిన ముఖాలతో ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఎక్కడ ఉన్నారు, ఎలా ఉన్నారు, పిల్లలు ఏం చదువుతున్నావంటూ ముచ్చట్లు చెప్పుకున్నారు. ఎన్ని సమస్యలు ఉన్నా, మళ్లీ మళ్లీ కలుసుకుందామంటూ ఒట్టేసుకున్నారు. ఆటపాటలతో సాయంత్రం వరకు సంతోషంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పి ఉన్నత జీవితాలకు మార్గాన్ని ఇచ్చిన ఆనాటి ప్రిన్సిపాల్ షరీఫ్‌ను ఘనంగా సత్కరించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మహాత్మా గాంధీ విగ్రహాన్ని తమ సొంత నిధులతో ఏర్పాటు చేసి ప్రిన్సిపాల్‌తో కలిసి ఆవిష్కరించారు.

## ఆలయాల్లో విగ్రహాల ప్రతిష్ట


ప్రతిష్ట విగ్రహాలను ఊరేగిస్తున్న దృశ్యం


పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

ఎస్.రాయవరం: దార్లపూడిలో మరిడిమాంబ ఆలయంలో నందీశ్వరిని విగ్రహం ప్రతిష్ఠించారు. తొలుత ప్రతిష్ట విగ్రహాలకు భారీ ఊరేగింపు నిర్వహించారు. దీంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. ఆలయాల అభివృద్ధి పనుల్లో భాగంగా మరిడిమాంబ ఆలయం, రామాలయంలో విగ్రహాలు ప్రతిష్ట చేపట్టారు. అమలాపురం మండలం బట్నవిల్లికి చెందిన చంద్రమౌళి భాస్కర్‌శర్మ ఆధ్వర్యంలో వేదపండితుల వేదమంత్రోచ్చారణలతో ఈ కార్యక్రమం నిర్వహించారు. రామలయంలో సోమవారం సిద్ధివినాయకుడు, సరస్వతీదేవి విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్టు తెలిపారు.

## ఎడతెరిపిలేని వర్షం

- లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం
- జనజీవనానికి ఆటంకం
- తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూం


కశింకోటలోని పీహెచ్‌సీ, బాలికల వసతి గృహానికి వెళ్లే రోడ్డులో చేరిన నీటిలో రాకపోకలకు ఇబ్బంది పడుతున్న ప్రజలు


కశింకోట ఆర్టీసీ బస్ స్టేషన్ రోడ్డు బురదమయం


కశింకోట మండల పరిషత్ కార్యాలయం ముందు చెరువులా చేరిన వర్షపు నీరు


కశింకోట వద్ద జాతీయ రహదారిని ఆనుకొని ఏరులా ప్రవహిస్తున్న వర్షపు నీరు


కశింకోటలో కురుస్తున్నప్పటి వర్షం

అనకాపల్లి టౌన్: మండలంతోపాటు పట్టణంలో ఎడతెరిపిలేని వర్షం కురిసింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో ఆదివారం ఉదయం మొదలుకొని రాత్రి వరకు వర్షం కురుస్తూనే ఉంది. ఈ వర్షంతో పట్టణంలోని వీధులన్నీ జలమయమయ్యాయి. ముఖ్యంగా విజయరామరాజు పేట అండర్ బ్రిడ్జి, గవరపాలెం పార్కు సెంటర్, ఆర్టీసీ కాంప్లెక్స్, పూడిమడక రోడ్డు జంక్షన్, శారదానగర్ తదితర ప్రాంతాల్లో వర్షంపు నిలిచిపోయింది. ఆయా వీధుల్లోని కాలువల్లో నుంచి వర్షం నీరు బయటకు పోయే మార్గం లేకపోవడం వల్ల రోడ్లపై ఏరులా పారింది. దాంతో చిరువ్యాపారులు, దినసరి కూలీలు ఇబ్బందులు పడ్డారు. ఆదివారం కావడంతో పెద్దగా జనసంచారం లేదు. ముందస్తు చర్యలో భాగంగా సాయంత్రం తహసీల్దార్ భాస్కర అప్పారావు తన కార్యాలయంలో వర్షం పరిస్థితిపై వీఆర్వోలతో సమీక్షించారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదని తహసీల్దారు తెలిపారు. తన కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. ఏకధాటిగా కురుస్తున్న వర్షం రైతులకు ఎంతగానో మేలు చేస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.

కశింకోట: మండలంలో ఆదివారం కుండపోత వర్షం కురిసింది. అత్యధికంగా వర్షపాతం నమోదైంది. ఈ ఏడాది కురిసిన వర్షాల్లో ఈ ఏడాదికి ఇదే ఇప్పటికి ఎక్కువ వర్షపాతం కానుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు 72.6 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయయ్యాయి. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ముందు భాగంలో మునిగి నీరు చేరింది. పీహెచ్‌సీ, సమగ్ర బాలికల వసతి గృహాలకు వెళ్లే రహదారిలో నీరు చేరింది. దీంతో ఆయా చోట్లకు రాకపోకలు సాగించడానికి ప్రజలు ఇబ్బంది చెందారు. ప్రధానంగా బాలికల వసతి గృహానికి ఆదివారం కావడంతో సుదూర ప్రాంతాల నుంచి సైతం వచ్చిన తల్లిదండ్రులు తమ పిల్లలను కలిసి తమ ప్రాంతాలకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బంది చెందారు. స్థానిక ఆర్టీసీ బస్ స్టేషన్ వర్షంతో బురదమయంగా మారింది. దీంతో ప్రయాణికులు బస్సు ఎక్కి, దిగి రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బంది చెందారు. కొన్ని బస్సులు బురద కారణంగా బస్ స్టేషన్‌లోకి రాకుండా నేరుగా జాతీయ రహదారి మీదుగా గమ్యాలకు వెళ్లిపోయాయి. జాతీయ రహదారి పక్కన కశింకోట, బయ్యవరం, తాళ్లపాలెం, నూతలగుంటపాలెం తదితర చోట్ల పల్లపు ప్రాంతాల్లో నీరు ఏరులా ప్రవహించింది. తాళ్లపాలెం కూడలిలో వర్షం నీరు చెరువులా చేరడంతో వాహన చోదకులు రాకపోకలు సాగించడానికి ఇక్కట్లకు గురయ్యారు. దీంతో వాహన చోదకులు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది చెందారు. వర్షం కారణంగా ప్రజలు ఇళ్లకే ఎక్కువ శాతం మేర పరిమితమయ్యారు. దీంతో కశింకోటలోని రోడ్లపై జన సంచారం తగ్గింది. వర్షం వల్ల పొలాల్లో నీరు చేరింది. దీంతో వరినాట్లు వేయడానికి వర్షం బాగా ఉపకరిస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మున్ముందు మరింతగా వర్షాలు పడితే వర్షాధారంతో పండించే వరినాట్లు పూర్తి కావడానికి అవకాశం కలుగుతుందంటున్నారు.


వర్షం కురుస్తుండడంతో నిర్మానుష్యంగా మారిన నాలుగురోడ్ల జంక్షన్


జలమయమైన విజయరామరాజు పేట రైల్వే అండర్ బ్రిడ్జి


పరిస్థితిని సమీక్షిస్తున్న తహసీల్దార్ అప్పారావు

### అనకాపల్లి సినిమాలు

| | |
|---|---|
| రాజా | : వార్ 2 |
| సత్యనారాయణ స్క్రీన్-1 | : వార్ 2 |
| సత్యనారాయణ స్క్రీన్-2 | : కింగ్ డమ్ |
| పర్తిసాయి | : మహావతార్ నరసింహం |
| షిర్డిసాయి | : కూలీ |
| వెంకటేశ్వర | : హరిహర వీరమల్లు |
| శ్రీ సత్య | : సోమేశ్వర సులోచన |
| రామచంద్ర | : వార్ 2 |

## వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల కమిటీల నియామకం

నాతవరం: వైఎస్సార్‌సీపీ మండల అనుబంధ సంఘాలకు నూతన కమిటీలను నియమించారు. దీనికి సంబంధించి సంఘాలు వారీగా అధ్యక్షుల వివరాలు ఇలా ఉన్నాయి. మండల బీసీ సెల్ కమిటీ అధ్యక్షుడిగా వేముల నాగ వెంకట సూరిబాబు, మండల క్రిస్టియన్ మైనార్టీ కమిటీ అధ్యక్షుడిగా కాకర సింహాచలం మండల కల్చరల్ కమిటీ అధ్యక్షుడిగా పైల మణేంద్ర, మండల దివ్యాంగుల విభాగం అధ్యక్షుడిగా మామిడి రాజుబాబు, మహిళా విభాగం మండల శాఖ అధ్యక్షురాలిగా ఇనపసప్పల పుష్ప, మండల పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడిగా మిరపల వెంకటరమణ, మండల ప్రచార కమిటీ అధ్యక్షుడిగా రెడ్డి సత్యనారాయణ, మండల సమాచార హక్కు (ఆర్‌టీ) విభాగం కమిటీ అధ్యక్షుడిగా కోసూరి వరహా పైడిరాజు(బుచ్చి), మండల రైతు విభాగం కమిటీ అధ్యక్షుడిగా అంకంరెడ్డి రాజుబాబు, మండల ఎస్సీ సెల్ కమిటీ అధ్యక్షుడిగా బొడ్డు సత్యనారాయణ, మండల సోషల్ మీడియా కమిటీ అధ్యక్షుడిగా కర్రి వెంకటరమణ, మండల ఎస్టీ సెల్ కమిటీ అధ్యక్షుడిగా కూడా శ్రీను, మండల విద్యార్థి విభాగం కమిటీ అధ్యక్షుడిగా పుణ్యమంతుల స్వామి, మండల యూత్ విభాగం అధ్యక్షుడిగా బండారు పైడన్ననాయుడు, మండల వీవర్స్ విభాగం కమిటీ అధ్యక్షుడిగా పడాల లక్ష్మినర్సింహరావు, మండల వలంటీర్ల విభాగం కమిటీ అధ్యక్షుడిగా సిద్దాబత్తుల వెంకటరమణ, మండల వాణిజ్య విభాగవ కమిటీ అధ్యక్షుడిగా గ్రంధి జగన్‌ను నియమించినట్టు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి అదేశాలు వచ్చాయి. అధ్యక్షులతో పాటు కమిటీలో ఉపాధ్యక్షులు, జాయింట్ కార్యదర్శులు, కార్యదర్శులు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు, కమిటీకి 18 మంది సభ్యులు చొప్పున ప్రతి కమిటీ నియమించారు.

## పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలి


పాడి రైతులతో మాట్లాడుతున్న డాక్టర్ చిట్టినాయుడు

సబ్బవరం: ఎడతెరిపి లేని వర్షాల నేపథ్యంలో పాడి రైతులంతా తమ పశువుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సబ్బవరం ప్రాంతీయ పశువైద్యశాల ఇన్‌చార్జ్ ఏడీ డాక్టర్ చిట్టినాయుడు తెలిపారు. మండలంలోని ఆరిపాక పంచాయతీ పరిధి చినయాతపాలెంలో పాడి రైతులకు పలు సూచనలు చేశారు. పాడుబడిన పశువులశాలలో పాడి పశువులను ఉంచవద్దన్నారు. పశువుల కొట్టాల్లో వాటిని తాళ్లతో కట్టవద్దని సూచించారు. నీరు ఎక్కువగా ఉండే గుంటలు, చెరువులు, జలాశయాల వద్దకు తీసుకెళ్లవద్దని హెచ్చరించారు. విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉంచాలని, పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లు తుఫాన్ సమయంలో మరణించినట్లైతే 24 గంటల్లో దగ్గర్లోని పశుసంవర్థక శాఖ అసిస్టెంట్‌కు లేదా పశు వైద్యశాల సిబ్బందికి తెలియజేయాలన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో అత్యవసర సేవలందించేందుకు మండలంలోని పశు వైద్య సిబ్బందితో మూడు బృందాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.